నేడు జెవివి ఛాయాచిత్ర ప్రదర్శన

ప్రజాశక్తి-కడప అర్బన్

గాంధీ జయంతిని పురస్కరించుకుని జన విజ్ఞాన వేదిక, సర్ సి.వి.రామన్ సైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఐటిఐ సర్కిల్ వద్ద ఈ నెల 2న గాంధీజీ జీవిత ఘట్టాలు, జీవిత సందేశం, స్వాతంత్ర ఉద్యమ పోరాటంలో గాంధీజీ పాత్ర, వర్తమాన ప్రపంచానికి గాంధీజీ ఆవశ్యకతపై ఫోటో చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు సమీర్ బాషా సి.వి.రామన్ సైన్స్ క్లబ్ కడప డివిజన్ అధ్యక్షులు ఆర్.శ్రీనివాసులురెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. మద్యం, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రభుత్వం మరింత కఠిన చర్యలు తీసుకోవాలని, సమాజంలో చైతన్యం పెంచాలని కోరుతూ ప్రత్యేక వినతి పత్రం గాంధీజీ విగ్రహానికి సమర్పించుకుంటామని జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి శివారా పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

సొంతిల్లు..నెరవేరని కల..!

- చెర్లోపల్లె లే అవుట్‌లో మౌలికవసతుల లేమి
- ఇబ్బందుల్లో ఇళ్లు కట్టుకున్న పేదలు
- మొండిగోడలు..పునాదుల దర్శనం
- అప్పలఊబిలో లబ్ధిదారులు
- పట్టని పాలకులు, అధికారులు

బురదమయంగా మారిన చెర్లోపల్లె రోడ్డు

ప్రజాశక్తి - కడప అర్బన్

పేదల సొంతింటి కల కోసం లబ్ధిదారులు అష్టకష్టాలు పడుతున్నారు. సంవత్సరాల తరబడి ఇల్లు నిర్మించుకునేందుకు నానాకష్టాలు పడుతున్నారు. పాలకులు కానీ, అధికారులు కానీ పట్టించుకున్న పాపానపోలేదు. సొంతింటి కోసం పేదలు సంవత్సరాల తరబడి ఎదురుచూస్తున్నారు. నగరం శివార్లలలోని చింతకొమ్మదిన్నె మండలం పాపాసాహేబ్‌పేట రెవెన్యూ పరిధిలో ఉన్న చెర్లోపల్లెలో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి నగరంలోని పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇళ్లు మంజూరు చేశారు. పేదలకు అప్రూవల్ లే అవుట్‌లో 4,444 కుటుంబాలకు ఇంటి పట్టాలు మంజూరు చేశారు. ఈ లేఅవుట్‌లో గతంలో 32, 50వ డివిజన్ల పరిధిలోని దాదాపు 500కు పైనే కుటుంబాలకు రహదారి ఏర్పాటు చేయడంలో పాలకులు, అధికారులు విఫలమయ్యారు. దాదాపు 200 కుటుంబాలకు పైగా ఇళ్లు కట్టుకుని ఉన్నారు. వీరికి ఉత్తరం, దక్షణం రోడ్లు ఉన్నాయి. తూర్పు, పడమర రోడ్లు లేకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్ల సమస్యతో పాటు మంచినీరు, విద్యుత్, విద్యుత్ దీపాలు, మురుగు కాలువలు, శ్మశాన వాటిక లేకపోవడంతో స్థాని పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లు కట్టుకునేందుకు ఒకోక్క కుటుంబం రూ.10 నుంచి రూ.12 లక్షల వరకు ఖర్చు చేసి అలాగే వదిలేశారు. దీనికి కారణంగా మౌలికవసతులు లేకపోవడం. ఇటు సొంత ఇంటిలో చేరలేక..అటు ఇన్న ఇళ్లకు బాడుగలు కట్టుకోలేక పేద ప్రజలు అప్పలఊభిలో కొట్టుమిట్లాడుతున్నారు. 2008లో అప్రూవల్ లే అవుట్ ఇచ్చినా ఇప్పటి వరకు మౌలికవసతులు కల్పించడంలో పాలకులు, అధికారులు విఫలమయ్యారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి పేదల కాలనీలలో మౌలిక వసతులు కల్పించాలని కోరుకుంటున్నారు. అనేక మంది సొంత ఇంటి కల నెరవేరేందుకు రూ.లక్షలు ఖర్చు చేసి ఇళ్లు నిర్మించుకుని ఉన్నారు. నిర్మించుకున్న ఇంటి చేరాలంటే మౌలిక వసతులు లేకపోవడంతో వెనుకడుగు వేస్తున్నారు. దీంతో పేదల సొంత ఇంటి కల..కలగానే మిగిలి పోతుంది.

మౌలికవసతులు లేకపోవడంతో ఆగిపోయిన ఇంటి నిర్మాణం

మౌలిక వసతులు కలించాలి

చెర్లోపల్లె లే అవుట్‌లో పేదలు నిర్మించుకున్న ఇళ్లకు మౌలిక వసతులు కల్పించాలి. రూ.లక్షలు ఖర్చు చేసినా ఇంటిలో చేరేందుకు వీలు లేకుండా పోతుంది. పాలకులు, అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించి, పేదలను ఆదుకోవాలి.

- వి.చంద్రకళ, చెర్లోపల్లె లే అవుట్, సి.కె.దిన్నె మండలం.

వర్షం వస్తే విషపురుగుల భయం

వర్షం వస్తే నివాస ప్రాంతాలలో విషపురుగులు తీరుగుతూ ఉన్నాయి. రాత్రి సమయంలో బయటకు రావాలంటే భయంభయంగా ఉంది. వర్షం నీరు వంకలోకి వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. విషపురుగల బారి నుంచి రక్షణ కల్పించాలి.

- ఆర్.వరలక్ష్మి, చెర్లోపల్లె లే అవుట్, సి.కె.దిన్నె మండలం.

విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి

చెర్లోపల్లె లే అవుట్‌లో జీవినం సాగిస్తున్న తమకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి. రాత్రి సమయంలో విద్యుత్ దీపాలు లేని కారణంగా దొంగతనాలు జరుగుతూ ఉన్నాయి.

- టి.సావిత్రి, చెర్లోపల్లె లే అవుట్, సి.కె.దిన్నె మండలం.

కడపకు వెళ్లాలంటే కష్టాంగా ఉంది

చెర్లోపల్లె లే అవుట్ నుంచి కడపకు వెళ్లాలంటే చాలా కష్టంగా ఉంది. రోడ్లు, రవాణా సౌకర్యం లేనికారణంగా ఇబ్బందులు పడుతున్నాం. విద్యను అభ్యసించాలంటే ప్రతి రోజు కడపకు వెళ్లాల్సిందే. చిన్న పాటి వర్షం వస్తే ఇంటి నుంచి బయటకు వెళ్లేందుకు వీలు లేకుండా పోతుంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి మౌళిక వసతులు కల్పించాలి.

- టి.సతీష్‌కుమార్, చెర్లోపల్లె లే అవుట్.

పేదల పక్షాన పోరాడుతాం

చెర్లోపల్లె లే అవుట్‌లో పేద ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలి. లేకపోతే పోరాటాలు నిర్వహిస్తాం. ఇప్పటికే ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టకి సమస్య తీసుకెవెళ్లాం. స్పందించకపోవడంతో పోరాటాలకు సిద్ధమవుతున్నాం.

- పి.చంద్రారెడ్డి, సిపిఎం నగర కమిటీ సభ్యులు, కడప.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి : జడ్జి

ప్రజాశక్తి-కడప

చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ అన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ వెల్ఫేర్ ఆఫ్ డిఫరెంట్లీ ఏబుల్ ట్రాంజెండర్ అండ్ సీనియర్ సిటిజన్ వారి సహకారంతో కడప కోర్టు ప్రాంగణంలో గల న్యాయ సేవా సదన్‌లో బుధవారం న్యూ మాడ్యూల్ లీగల్ సర్వీసెస్ క్యాంపు, అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి పలు చట్టాలపై అవగాహన కలిగించారు. లీగల్ సర్వీసెస్ టు సీనియర్ సిటిజన్స్ పథకం 2016 గురించి వివరించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, న్యూఢిల్లీ వారు అందరికీ అందుబాటులో న్యాయానికై కృషి చేస్తుందని తెలిపారు. వృద్ధుల సహకారాన్ని గుర్తించడానికి, వారి జీవితాలను ప్రభావితం చేసే సమస్యలను పరిశీలించడానికి ఏటా ఈ అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని జరుపుకుంటామనిమ పేర్కొన్నారు. సెక్షన్ 125 సిఆర్‌పిసి, సంరక్షణ, భద్రత కల్పించవలసిన వృద్ధులను విడిచిపెట్టిన, పరిత్యాగం చేసే విధంగా బుద్ధిపూర్వకంగా వ్యవహరించిన అట్టివారు శిక్షార్హులు అవుతారన్నారు. శిక్షాకాలం గరిష్టంగా మూడు నెలలు జైలు శిక్ష లేదా అపరాధ రుసుం గరిష్టంగా రూ.ఐదు వేలు లేదా రెండింటినీ కలిపి విధించ వచ్చన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ వెల్ఫేర్ ఆఫ్ డిఫరెంట్లీ ఏబుల్ ట్రాంజెండర్ అండ్ సీనియర్ సిటిజన్ కృష్ణకిషోర్, కడప పెన్షనర్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఎన్.రామమూర్తి నాయుడు, వృద్ధాశ్రమం ప్రతినిధులు, ఎన్‌జిఒలు, రిటైర్డ్ పెన్షనర్లు, వృద్ధాశ్రమం సీనియర్ సిటిజల్లు పాల్గొన్నారు. అనంతరం కడప జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సభ్యులు, ఎన్‌జిఒలు, సీనియర్ సిటిజన్ అధికారులు స్టాళ్లను ఏర్పాటు చేసి సీనియర్ సిటిజన్లకు ఉపయోగపడే పథకాల పట్ల అవగాహన కల్పించి కరపత్రాలను పంచిపెట్టారు.

మాట్లాడుతున్న జడ్జి బాబా ఫక్రుద్దీన్

ఎస్‌పిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి-కడప

జిల్లా ప్రజల సంక్షేమం, శాంతిభద్రతల పరిరక్షణ పట్ల తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎస్‌పి నచికేత్ విశ్వనాథ్ అన్నారు. నూతన ఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించిన నచికేత్ విశ్వనాథ్‌ను వారి కార్యాలయంలో కాంగ్రెస్ యువనేత వెన్నపూస మధురెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా శాంతి భద్రతలు, అసాంఘిక కార్యకలాపాలు వంటి అంశాలపై ఆయనతో చర్చించారు. ప్రజల భద్రతా పరిరక్షణలో ఎస్‌పి విజయవంతం కావాలన్న ఆకాంక్ష వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్‌టిఐ రాష్ట్ర చైర్మన్ కోటపాటి లక్ష్మయ్య, ఆడిటర్ శంకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ డిస్ట్రిక్ట్ వైస్ ప్రెసిడెంట్ అఖిల్ పాల్గొన్నారు.

ఎస్‌పిని సన్మానిస్తున్న మధురెడ్డి

మహిళల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం

ప్రజాశక్తి-కలసపాడు

మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందన్న సంకల్పంతో ప్రధానమంత్రి స్వస్థనారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారని వైద్యాధికారి డాక్టర్ సాయితేజ, చెన్నుపల్లె సర్పంచ్ నవీన్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని చెన్నుపల్లె పంచాయతీ కార్యాలయంలో స్వస్థనారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో అధిక రక్తపోటు, మధుమేహం, కేన్సర్ లక్షణాలు గుర్తించటం, గర్భిణులు, బాలింతలకు చికిత్సలు అందించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. పోషకాహారం, వ్యాధినిరోధక టీకాలు వేశారు. స్థానిక అంగన్వాడీ సిబ్బందితో కలిసి సర్పంచ్ నవీన్‌కుమార్, వైద్యాధికారి డాక్టర్ సాయితేజ గర్భిణులకు పోషకాహారం అందజేశారు. కార్యక్రమంలో సిహెచ్ఒ వెంకట సుబ్బమ్మ, హెల్త్ అసిస్టెంట్ రామతీర్థం, ఎంఎల్ హెచ్‌పి శ్రీవాణి, ఎఎన్ఎం ఆదిలక్ష్మి, ఎంఎల్ హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.



గర్భిణీకి పోషకాహారం అందజేస్తున్న డాక్టర్, సర్పంచ్

పర్యాటక రంగంలో విశిష్టి కృషికి పట్టాభిషేకం

- వైవీయూ పాలకమండలి సభ్యులు మల్లికార్జునరెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్: జిల్లాలో పర్యాటక రంగానికి విశిష్టమైన కృషి చేసిన యోగివేమన విశ్వ విద్యాయం లలిత కళల విభాగం అధ్యాపకులు డాక్టర్ కోట మృత్యుంజయరావుకు పర్యాటక ఎక్సలెన్స్ అవార్డు రావడం జిల్లా పర్యాటక రంగానికి పట్టాభిషేకం చేయడమేనని యోగి వేమన విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. ప్రపంచ పర్యాటక రంగ దినోత్సవ సందర్భంగా సెప్టెంబర్ 27వ తేదీ విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా పర్యాటక ఎక్సలెన్స్ అవార్డు అందుకున్న మృత్యుంజయరావును జిల్లా రచయితల సంఘం బుధవారం కడప సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో అభినందన సభ ఏర్పాటు చేసి, ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మూల మాట్లాడుతూ కోట మృత్యుంజయరావు ప్రసిద్ధ పర్యాటక ప్రదేశాలపై, ఆలయ శిల్పాలు, కుడ్య చిత్రాలు, హస్తకళలు మొదలైన వాటి విశిష్టతను చాటుతూ ఇప్పటికే 60కి పైగా పరిశోధనాత్మకమైన వ్యాసాలు రాసి అనేక జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో పత్ర సమర్పణలు చేయడం విశేషమన్నారు. రచయితల సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, కార్యదర్శి డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి మాట్లాడుతూ లేపాక్షి చిత్రకళపై పరిశోధన చేసి డాక్టరేట్ అందుకున్న మృత్యుంజయరావు జిల్లా పర్యాటక రంగ వైభవాన్ని చాటుతూ తెలుగు, ఇంగ్లీషు భాషల్లో పుస్తకాలు ప్రచురించి జిల్లా కీర్తిని విశ్వవ్యాప్తం చేశారన్నారు. కార్యాక్రమంలో కడప రెడ్డి సేవా సమితి అధ్యక్షులు లెక్కల కొండారెడ్డి, కొండూరు జనార్ధన రాజు, రచయితల సంఘం కోశాధికారి డాక్టర్ కొప్పోలురెడ్డి శేఖర్‌రెడ్డి, చదలవాడ వెంకటేష్, డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, కందిమల్ల రాజారెడ్డి, రంగస్థలం నటులు మధుబాబు, శాసన పరిశోధకులు ఎన్.మునికుమార్ పాల్గొన్నారు. జిల్లా రచయితల సంఘం వారికి మృత్యుంజయరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు.

మృత్యుంజయరావును సన్మానిస్తున్న ప్రముఖులు

ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకే నిరసన

ప్రజాశక్తి-కడప అర్బన్

ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట వైద్యాధికారులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు 25 సంవత్సరాలుగా ఉద్యోగోన్నతులు లభించకపోవడం బాధాకరమన్నారు. డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ పరిధిలోని పిహెచ్‌సి వైద్యులు మాత్రం ప్రమోషన్ల కోసం ఎదురు చూస్తూ సిఎఎస్ గానే రిటైర్ అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యాధికారులు ఆర్థిక ప్రయోజనాలు కాకుండా మానవ వనరుల పరంగా టైమ్ బౌండ్ ప్రమోషన్లు తమ న్యాయమైన హక్కు అని అభిప్రాయపడ్డారు. జీవో 99 ద్వారా ఇన్‌సర్వీస్ పీజీ కోటా 15 శాతానికి తగ్గించి, 7 విభాగాలకు మాత్రమే పరిమితం చేయడాన్ని ఖండించారు. పొరుగు రాష్ట్రాలైన కేరళలో 50 శాతం, కర్ణాటకలో 40 శాతం, తమిళనాడులో 30 శాతం ఇన్‌సర్వీస్ కోటా పీజీ సీట్లను మంజూరు చేస్తున్నప్పుడు, ఎపిలో మాత్రం వైద్యులను వెనకడుగు వేయించే విధా నాన్ని కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు కరోనా మహమ్మారి సమయంలో తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి, ప్రజల ప్రాణాలను రక్షించినప్పటికీ, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల వారి హక్కులు సంవత్స రాలుగా అమలు కావడం లేదని గుర్తు చేశారు. ఇప్పటికే పలు సార్లు ఉన్నతాధికారులు, ఆరోగ్యశాఖ మంత్రి, ముఖ్యమంత్రిని కోరుకున్నప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో ఈ నిరసన చేపట్టక తప్పలేదని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సెక్రెటరీ వినయ్ కుమార్, కోశాధికారి మొహమ్మద్ తాహా, డాక్టర్ మహినూర్, డాక్టర్ కరిష్మా, డాక్టర్ మేరీ సుజాత, డాక్టర్ జ్యోష్ణ, జిల్లాలోని పిహెచ్‌సి డాక్టర్లు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న వైద్యులు

మాట్లాడుతున్న సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్

వైద్యుల సమ్మెను విరమింపజేయండి : సిపిఎం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, వారు చేస్తున్న ఆందోళనలను విరమింప చేయకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడం సమంజసం కాదని సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ అన్నారు. బుధవారం సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంబిబిఎస్ పూర్తి చేసిన తర్వాత పిహెచ్‌సిలో పనిచేసే వైద్యులకు ప్రత్యేక రిజర్వేషన్‌ను పోస్ట్‌గ్రాడ్యుయేషన్ కోసం అర్హత సాధించేందుకు గతంలో ఇన్ సర్వీస్ కోటాను క్లినికల్ కోటాలో 30 శాతం, నాన్ క్లినికల్ కోటాలో 50 శాతం అమలు చేసేవారని తెలిపారు. ప్రభుత్వం దీన్ని సవరణ చేస్తూ క్లినికల్‌లో 15 శాతం, నాన్ క్లినికల్ కోటాలో 30 శాతానికి కుదించారన్నారు. రాష్ట్రంలో అనేక ప్రభుత్వ ఆసుపత్రులలో పీజీ పూర్తి చేసిన వైద్యుల ఖాళీలు భర్తీ చేయకుండా ఉన్నాయన్నారు. దీన్ని వైద్యుల సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తూ సెప్టెంబర్ 26వ తేదీ నుంచి సమ్మె చేస్తున్నారని పేర్కొన్నారు. పీజీ ఇన్ సర్వీస్ కోటా పునరుద్ధరణ, నిర్దిష్ట కాల పరిమితిలో ప్రమోషన్లు, గిరిజన, సంచార చికిత్స అలవెన్స్, తదితర సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజారోగ్యం మీద వైద్యుల సమ్మె ప్రభావం పడుతుందని, ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని రోగులు ప్రభావితం కాకుండా సమస్య పరిష్కారం చేయాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే వైద్యుల సంఘం ప్రతినిధులతో చర్చలు జరిపి సమస్యను సానుకూలంగా పరిష్కరించాలన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, రామకృష్ణారెడ్డి, నరసింహ పాల్గొన్నారు.

విభజన హామీలు అమలు చేయాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-కడప అర్బన్

స్వాతంత్ర్య పోరాటంలో జాతిని ఏకం చేసి పోరాడిన మహాత్మా గాంధీ స్ఫూర్తితో కడప ఉక్కును సాధించుకుందాం, మత సామరస్యాన్ని కాపాడుకుందామని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల.శివకుమార్ తెలిపారు. ఈ నెల 2వ తేదీన గాంధీజీ జయంతి పురస్కరించుకుని బాలాజీ నగర్‌లోని నెహ్రూ యువకేంద్రంలో గాంధీజీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశంలో మతాల పేరుతో, కులాల పేరుతో గొడవలతో అధికారాన్ని చేపడుతూ వస్తున్నదన్నారు. నాడు గాంధీకి జాతి సమైక్యత కోసం కృషి చేశారన్నారు. మత సామరస్యాన్ని పాటిస్తూ వచ్చారని పేర్కొన్నారు. నేడు బీజేపీ దానిని పూర్తిగా విస్మరించిందని తెలిపారు. దేశాన్ని అంబానీ, అదానీలకు తాకట్టు పెడుతున్నదన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాలు పేరుతో హెచ్1బి వీసాల విషయంలో భారత్‌పై అనేక ఆంక్షలు విధిస్తూ ఆధిపత్యం చెలాయిస్తున్న ఎక్కడా నరేంద్ర మోడీ నోరు మెదపలేదని చెప్పారు. అమెరికా సామ్రాజ్య వాదానికి జీహుజూర్ అనడం తప్ప ఎక్కడా మాట్లాడిన దాఖలాలు లేవన్నారు. కేంద్రం ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తు వస్తున్నదన్నారు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రదానంగా విభజన హామీలలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటులో నిర్లక్ష్యం వహిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రానికి హోదా లేదు, రాయలసీమకు ప్యాకేజీ లేదన్నారు. లక్షల మంది యువకుల కల ఉక్కు పరిశ్రమని తెలిపారు. బిజెపి ఉక్కుపై నిర్లక్ష్యం వహిస్తున్నదని చెప్పారు. రాష్ట్రంలో ముగ్గురు ముఖ్యమంత్రులు కడప ఉక్కుకు మూడు శిలాఫలకాలు ఉన్నాయన్నారు. 32 మంది ప్రాణ బలిదానంతో ఏర్పడ్డ విశాఖ ఉక్కును ప్రయివేటుపరం చేయాలని చూస్తున్నారన్నారు. ఇప్పటికి విశాఖ ఉక్కు సొంత గనులు ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడం లేదన్నారు. నాడు గాంధీజీ కన్న కలలకు నేడు బిజెపి పాలనకు పూర్తి విరుద్ధమన్నారు. కడప ఉక్కు కోసం, విభజన హామీల కోసం, జాతి సమైక్యత కోసం, మత సామరస్యము కోసం ప్రతి ఒక్కరం పాటు పడదామన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నగర ఉపాధ్యక్షులు పెద్దన్న, రియాన్, రంజిత్, ఆర్య, సురేష్, సాయి పాల్గొన్నారు.

గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

రేపటి నుంచి యోగా బ్యాచ్ ప్రారంభం

ప్రజాశక్తి-కడప అర్బన్: పటేల్ రోడ్డులోని మిత్ర యోగా సెంటర్‌లో 30 రోజుల పాటు నిర్వహించబడే యోగా శిక్షణ కొత్త బ్యాచ్‌ను ఈ నెల 3వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు యోగా నిపుణులు డాక్టర్ కల్పన, డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణలో రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి, మానసిక ఒత్తిడిని తగ్గించు కోవడానికి, అధిక బిపి, డయాబెటిస్, ఒబేసిటీ, థైరాయిడ్, పిసిఒడి వంటి దీర్ఘకాలిక సమస్యల నివారణకు యోగా సాధన చేయిస్తామని పేర్కొన్నారు. ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచుకోవడానికి అవస రమైన యోగాసనాలు, ప్రాణాయామం, సూర్యనమస్కారాలు, షట్ క్రియలు, ధ్యానం వంటి యోగ ప్రక్రియలను శాస్త్రీయంగా సాధన చేయిస్తామని తెలిపారు. ఈ శిక్షణ ఉదయం 5.45 గంటల నుంచి 7.00 గంటల వరకు మొదటి బ్యాచ్, ఉదయం 8.30 గంటల నుంచి 10 గంటల వరకు మహిళలకు రెండో బ్యాచ్ ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 9848861206, 7013238986 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

విద్యుత్ సమస్యలపై సమ్మెకు సిద్ధం

ప్రజాశక్తి-కడప అర్బన్: విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల, కార్మికుల సమస్యలపై సమ్మెకు సిద్ధమని ఎపి విద్యుత్తు స్ట్రగుల్ కమిటీ నాయకులు పేర్కొన్నారు. బుధవారం విద్యుత్ భవన్ ఆవరణంలో స్ట్రగుల్ కమిటీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు సమస్యలు పరిష్కరించాలని సంవత్సర నుంచి అధికారులకు, ప్రభుత్వానికి విన్నపాలు, రాయబారాలు, ఆందోళన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ప్రభుత్వ యంత్రాంగంలో ఎటువంటి చలనం లేకపోవడంతో 15 నుంచి విద్యుత్ సంస్థలో సమ్మెకు సిద్ధంగా ఉన్నామని స్ట్రగుల్ కమిటీ నిర్ణయించిందని చెప్పారు. సమావేశంలో స్ట్రగుల్ కమిటీ చైర్మన్ పి.సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వి.సుబ్బారెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, ఎన్.శివశంకర్, డిస్కం అధ్యక్షులు ఎం.శివ శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

బాబు మోసాలను ఎండగడతాం : వైసిపి

ప్రజాశక్తి-కడప: చంద్రబాబు కూటమి ప్రభుత్వ పాలన అంతా మోసం, దౌర్జన్యమేనని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. బాబుకు ప్రాజెక్టులపై ఎటువంటి అవగాహన, చిత్తశుద్ధి లేదన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని తగిన రీతిలో గుణపాఠం చెబుతారన్నారు. బుధవారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాటాడుతూ చంద్రబాబు రైతులను, యువతను, నిరుద్యోగులను, మహిళలను మోసం చేశాడన్నారు. రాష్ట్రాన్ని అప్పుల మయం చేశాడన్నారు. కూటమి ప్రభుత్వ తప్పులను ప్రశ్నిస్తే దౌర్జన్యంగా వారిపై దాడులు చేసి, అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారన్నారు. మా ప్రభుత్వం అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు ఇస్తాం అన్నారు, నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు, అవి ఏమి చేయకుండా నిరుద్యోగ యువతను మోసం చేశారన్నారు. ఉద్యోగులకు నాలుగు డీఏలు, పిఆర్సి, సిపిసి ఏమి ఇవ్వలేదన్నారు. రాష్ట్రం అప్పు పెరిగింది తప్ప ఎవరికి ఏమి మేలు చేసింది లేదన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు పులి సునీల్ కుమార్, కరీముల్లా, నాయకులు పాల్గొన్నారు.

యాగశాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కాశినాయన: బ్రహ్మంగారిమఠం మండలంలోని పి.కొత్త పల్లెలో కోడూరు దుర్గమ్మ ఆలయంలో బద్వేల్ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బసిరెడ్డి రవీంద్రారెడ్డి రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన యాగశాలను మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, బద్వేల్ టిడిపి ఇన్‌ఛార్జి రితీష్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు బసిరెడ్డి రవీంద్రారెడ్డిని అభినందించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో వారిని సత్కరించారు. నిర్మాణకర్త బసిరెడ్డి రవీంద్రారెడ్డి మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి నా వంతు కృషి చేస్తున్నానని, దేవాలయంలో దేవుడు నన్ను ఆశీర్వదించినందుకు రుణం తీర్చుకున్నానని పేర్కొన్నారు. ఆహ్వానించిన వెంటనే మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, బద్వేల్ టిడిపి ఇన్‌చార్జి రితీష్‌రెడ్డి ఇక్కడికి వచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. ప్రారంభోత్సవం అనంతరం వారికి శాలువలతో పూలమాలతో ఘనంగా రవీంద్రారెడ్డి సన్మానించారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

యాగశాలను ప్రారంభిస్తున్న పుట్టా, రితీష్

కాంగ్రెస్ పోరాట ఫలితమే బుగ్గవంకపై వంతెనలు

ప్రజాశక్తి-కడప అర్బన్: బుగ్గ వంకపై షామీరియా మసీదు, న్యాయ కళాశాల వద్ద వంతెనల నిర్మాణానికి చేసిన శంకుస్థాపనలు కాంగ్రెస్ పార్టీ పోరాట ఫలితమేనని డిసిసి ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ పీర్ అన్నారు. బుధవారం బ్రిడ్జి ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప నగరంలోని బుగ్గ వంక ఆధునికీకరణకు ముఖ్య కారణం కాంగ్రెస్, రాజశేఖరరెడ్డి నాయకత్వమన్నారు. కడప నగర అభివృద్ధి జరిగిందంటే అది కాంగ్రెస్ హయాంలోనేనని గుర్తు చేశారు. కడప సుందరీకరణ, రిమ్స్, నగరం కార్పొరేషన్‌గా మారడం కాంగ్రెస్ హయాంలో రాజశేఖర్‌రెడ్డి చేతులు మీదుగానేని తెలిపారు. ఆ తర్వాత వచ్చిన ఏ పార్టీ అభివృద్ధి చేయలేదని చెప్పారు. ఈ రెండు బ్రిడ్జిలు కూడా ఆ సమయంలో పూర్తి కావాల్సి ఉండగా కొన్ని అనివార్య కారణాలవల్ల జరగలేదని, ఆ తర్వాత ప్రభుత్వాలు దీన్ని పట్టించుకోలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ అలుపెరుగని పోరాటం చేసిందని చెప్పారు. వాటిలో ముఖ్యంగా హమీద్, దినకర్ ముఖ్య భూమికి పోషించారని తెలిపారు. డిసిసి అధ్యక్షులు విజయజ్యోతి నిరసనలు తెలిపి, జెసిని కలిసి ఇక్కడ బ్రిడ్జిల ఆవశ్యకతను వివరించారని పేర్కొన్నారు. బ్రిడ్జిలో నిర్మాణం వెంటనే జరగని పిసిసి అధ్యక్షులు షర్మిల స్వయంగా వచ్చి నిరసన కార్యక్రమాలు చేపడతానని తెలియజేయడంతో వెంటనే హుటాహుటిన ప్రభుత్వంలోనూ, అధికారులలోనూ చలనం కలిగి శంకుస్థాపన చేశారని తెలిపారు.

మాట్లాడుతున్న సయ్యద్ గౌస్‌పీర్

అలయంలో ఎమ్మెల్యే పుట్టా, రితీష్‌రెడ్డి

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే పుట్టా, రితీష్‌రెడ్డి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో జరుగుతున్న శరన్నవ రాత్రుల మహోత్సవాల సందర్భంగా బుధవారం మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్, బద్వేల్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి రితీష్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. వీరికి అమ్మవారిశాల అధ్యక్షుడు అయ్యప్ప వెంకట సురేష్ బాబు, కార్యదర్శి సుంకు సురేష్‌బాబు, కోశాధికారి దుగ్గిశెట్టి వెంకటేశ్వర్లు, యువజన సంఘం అధ్యక్షులు యాదాళ వెంకటసుబ్బయ్య పూర్ణకుంభం, మేళతాళాలతో స్వాగతం పలికారు. ఘనంగా సన్మానించారు. చెన్నుపల్లి సుబ్బారెడ్డి, ఎన్నార్ శ్రీనివాసులరెడ్డి, మైదుకూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఏపీ రవీంద్రను సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు పోలిరెడ్డి, సొసైటీ చైర్మన్ సాంబశివారెడ్డి, నాయకులు పూజ శివయ్య యాదవ్, మేకల సుధాకర్, శీలం నరసింహ గౌడ్, అమ్మవారిశాల యువజన సభ్యులు దుగ్గిశెట్టి గురవయ్య, మాకం సురేష్ ఉన్నారు.

రైతులకు లబ్ధి చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - జమ్మలమడుగు

జిఎస్‌టిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఎమ్మెల్యే ఆది నారాయణరెడ్డి తెలిపారు. ఆర్‌డిఓ కార్యాలయంలో బుధవారం వ్యవసాయ శాఖ అధికారులతో జిఎస్‌టిపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏపీ సీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరి శీలించారు. కార్యక్రమంలో ఎడి శివశంకర్ రెడ్డి, పశుసంవర్ధక శాఖ ఎడి శ్రీధర్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు, ఏపీ సీఎంఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వేంపల్లె : రైతులకు లబ్ధి చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఎఓ శివశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో బుధవారం వ్యవసాయ, దాని అనుబంధ శాఖల ఆధ్వర్యంలో జిఎస్‌టి అధికారుల సహకారంతో సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్‌పై రైతులు, ఎరువుల డీలర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రత్యేక చొరవతో వ్యవసాయం, అనుబంధ రంగాలకు ఉపయోగించే వివిధ రకాల వస్తువులు, పరికరాలపై జిఎస్‌టి 5శాతం తగ్గించినట్లు తెలిపారు. జిఎస్‌టి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ యాసింఖాన్ మాట్లాడుతూ వ్యవసాయ రంగాలకు సంబంధించిన వివిధ రకాల వస్తువులపై విధించే జిఎస్‌టి వివరాలను ప్రతి రైతు తెలుసుకోవాలని సూచించారు. మండల పశు వైద్యాధికారి రవి పశుసంవర్ధక శాఖ ద్వారా లబ్ధి చేకూరే వివిధ రకాల పథకాలను రైతులకు వివరించారు. వ్యవసాయ ట్రాక్టర్లు, వివిధ రకాల వ్యవసాయ యాంత్రిక పరికరాల ధరలను ప్రదర్శించారు. కార్యక్రమంలో రైతులు, ఎరువుల దుకాణదారులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

వేముల : వేముల రైతు సేవ కేంద్రంలో బుధవారం వ్యవసాయ, అనుబంధ రంగాలకు సంబంధించిన అధికారుల ఆధ్వర్యంలో సూపర్ జిఎస్‌టి..సూపర్ సేవింగ్స్ అనే కార్యక్రమంపై రైతులకు అవగాహన కల్పించారు. ఎఓ జిసి ఓబులేసు, టిడిపి నాయకుడు పేర్ల శేషారెడ్డి, మండల వ్యాప్తంగా అన్ని రైతు సేవ కేంద్రాల సిబ్బంది, ఏఈఓ సురేష్, ఏపీ సీఎంఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం వ్యవసాయ, అనుబంధ రంగాలకు సంబంధించిన అధికారుల ఆధ్వర్యంలో సూపర్ జిఎస్టి.. సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఎడి ప్రభాకర్‌రెడ్డి, జిఎస్టి డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ రాజశేఖర్‌రెడ్డి, పశు వైద్యాధికారి సుబ్బారాయుడు, ఎఒ చెన్నారెడ్డి, టెక్నికల్ వ్యవసాయ అధికారి సునీల్‌కుమార్‌రెడ్డి, మహీంద్ర ట్రాక్టర్ కంపెనీ ప్రతినిధులు, రైతులు, ఎరువుల దుకాణదారులు పాల్గొన్నారు.

చక్రాయపేట : చక్రాయపేట రైతు సేవా కేంద్ర కార్యాలయంలో బుధవారం వ్యవసాయ, అనుబంధ రంగాలకు సంబంధించిన అధికారుల ఆధ్వర్యంలో సూపర్ జిఎస్‌టి.. సూపర్ సేవింగ్స్‌పై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక డిప్యూటీ తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ప్రత్యేక వ్యవసాయ సిబ్బంది, ఎంపిటిసి ప్రతాప్, వెంకటేష్, బీబీ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సింహాద్రిపురం : ప్రభుత్వం వ్యవసాయ యంత్ర పరికరాలపై ధరలు తగ్గించారని తుంగభద్ర హై లెవెల్ కెనాల్ డైరెక్టర్ చైర్మన్ మారెడ్డి జగదీశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఆర్‌ఎస్‌కెలో జిఎస్‌టి 2.0పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎఓ కళ్యాణ్‌కుమార్, ఏఈఓ భార్గవరెడ్డి, ప్రత్యేక వ్యవసాయ సిబ్బంది, ఎరువులు, పురుగుమందులు, రసాయన డీలర్లు పాల్గొన్నారు.

పింఛన్లతో లబ్ధిదారుల జీవితాల్లో వెలుగులు

జమ్మలమడుగు : కూటమి ప్రభుత్వం అందిస్తున్న ఎన్‌టిఆర్ పింఛన్లతో లబ్ధిదారుల జీవితాల్లో వెలుగులు వచ్చాయని జమ్మలమడుగు నియోజకవర్గ బిజెపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఎస్.ఉప్పలపాడులో బుధవారం టిడిపి నాయకులు ఎన్‌డిఎ కూటమి నాయకులతో కలిసి పెన్షన్ పంపిణీ చేశారు. అనంతరం భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ పెన్షన్ పంపిణీ ప్రక్రియ ఒకటవ తేదీ తెల్లవారుజాము నుంచి సక్రమంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన కో-ఆర్డినేటర్ నర్వారెడ్డి నాగార్జున, జమ్మలమడుగు మార్కెట్ యార్డ్ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, వైస్ చైర్మన్ మల్లికార్జున, సచివాలయం అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల అభివృద్ధికి భూపేష్ ప్రత్యేక కృషి

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణాభివృద్ధికి జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి ప్రత్యేక కృషి చేస్తున్నారని టిడిపి నాయకులు పేర్కొన్నారు. పట్టణంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీలో బుధవారం సచివాలయ సిబ్బంది చంద్రశేఖర్‌రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షులు సన్నపురెడ్డి సంజీవరెడ్డి పాల్గొన్నారు. శాంతినగర్‌లో 12,13వ వార్డుల్లో పింఛన్లు పంపిణీ చేశారు. సంజీవరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలకిచ్చే ఆర్థిక సహాయం ఇప్పించారని వివరించారు. టిడిపి నాయకులు శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు విజయదశమి ఉత్సవాలు

చక్రాయపేట : చక్రాయపేటలో వెలసిన శ్రీవెంకటేశ్వర స్వామి, వీరభద్ర స్వామి దేవాలయ ఆవరణలో గురువారం విజయదశమి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన చైర్మన్ మోపూరి రామాంజనేయరెడ్డి(అడ్వకేట్)తెలిపారు. ఈ ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

నాబార్డ్ నిధులతో రాజకొట్టాల్ రోడ్డు నిర్మాణం

అధ్వానంగా ఉన్న రాజకోట రోడ్డు

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు-ప్రొద్దుటూరు ప్రధాన రహదారి నుండి మండల పరిధిలోని రాజకోటాల్ గ్రామానికి తారు రోడ్డు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్‌అండ్‌బీ ఏఈ అశోక్‌కుమార్ తెలిపారు. గతంలో ఏర్పాటు చేసిన తారు రోడ్డు కొంత కాలానికే అధ్వానంగా తయారైంది. ఏటూరు కాలువ వెంబడి ఎన్నో ఏళ్లుగా గ్రావెల్ రోడ్‌పై ప్రయాణం సాగిస్తున్న గ్రామస్తుల అభ్యర్థన మేరకు గత ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ అనుసంధానంతో తారు రోడ్డు నిర్మించారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు ఏమాత్రం పాటించ కపోవడంతో మూడవ ఏడాది తిరగకుండానే రోడ్డు పూర్తిగా దెబ్బతింది. తారు రోడ్డు పూర్తిగా దెబ్బతిని గ్రావెల్ బయట పడి రోడ్డు అంతా గుంతల మయంగా తయారైంది. రోడ్డు పూర్తి స్థాయిలో మరమ్మతు చేయాలని ప్రజల నుంచి అభ్యర్థనలు రావడంతో.. సమస్యను అధికారులు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన రూ.45 లక్షలు నాబార్డ్ నిధులు రోడ్డు నిర్మాణానికి మంజూరు చేయించారు. ఈ మార్గాన రాజకోటతోపాటు విజయనగరం, ఓబులరెడ్డిపేట , గాంధీనగరం ప్రజలు మైదుకూరు, చాపాడు, ప్రొద్దుటూరుకు రావాల్సి ఉంటుంది. ఎలాం టి వాహనాలు కూడా ఈ మార్గాన ప్రయాణానికి అందుబాటులో ఉండవు. ప్రజలు స్వచ్ఛందంగా ఆటోలను ద్విచక్ర వాహనాన్ని కలిగి ఉండాల్సిందే. ఇప్పటికైనా ఆయా గ్రామాల సమస్యలను దృష్టిలో ఉంచుకుని తారు రోడ్డు నిర్మిస్తుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర కన్‌స్ట్రక్షన్స్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనుంది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించి రోడ్డు ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు.

నేల రాలిన 'చీనీ' రైతుల ఆశలు

ప్రజాశక్తి - తొండూరు

చీనీ రైతుల ఆశలు నేలరాలాయి. కొన్నేళ్లుగా వరుసగా చీనీ కాయల ధరలు పడిపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఈ ఏడాది పండుగ అంచనాలను పూర్తిగా దెబ్బతీసింది. చీనీ చరుకు ధర క్వింటాల్ రూ.15 నుంచి రూ.20 వరకే ఉండడంతో ఖర్చులు కూడా తేల్చలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సీజన్‌లో మల్లెల గ్రామానికి చెందిన రైతు నాగిరెడ్డి మాట్లాడుతూ.. సుమారు 4 ఎకరాల్లో చీని సాగు చేశాడు. ఆశించిన ధర రాకపోవడంతో తోటలోనే పండ్లు నేలరాలిపోతున్నాయి. రోజూ కూలీల ఖర్చు, ఎరువులు, మందులు, నీటి ఖర్చులు అన్నీ భరించలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో రైతు నాగిరెడ్డి మాట్లాడుతూ ఒక ఎకరానికి కనీసం రూ.50 వేలు ఖర్చు అవుతుంది. కానీ మార్కెట్‌లో చీని ధరలు అట్టడుగుస్థాయిలో ఉన్నాయి. 65 నుంచి 90 కిలోల వరకు దిగుబడి వచ్చినా, అమ్మకానికి వెళితే లాభం కనిపించట్లేదు. తోటలో నేలరాలిపోతున్న పండ్లను చూస్తే మనసు మళ్లీ బాధపడుతుంది అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. ఎకరానికి వచ్చిన దిగుబడి, పంట కాలం 9 నెలల కష్టానికి సరిపడా ఆదాయం రాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని చీనీ రైతులు కోరుతున్నారు.

మల్లేల గ్రామంలో నేలరాలిన చీనీ కాయలు

శ్రీరామ్ ఫైనాన్స్‌పై చర్యలు తీసుకోవాలి

యువకుడిని పరామర్శిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

శ్రీరామ్ ఫైనాన్స్ వారి వేధింపులు తాళలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారని, దానిపై చర్యలు తీసుకోవాలని జమ్మలమడుగు సిఐటియు కార్యదర్శి దాసరి విజయ్ డిమాండ్ చేశారు. మైలవరం గ్రామానికి చెందిన ఓ యువకుడు బుధవారం జమ్మలమడుగు శ్రీరామ్ ఫైనాన్స్ వారి ఆగడాలను తాళలేక బలవన్మరణానికి పాల్పడ్డాడని తెలిపారు. చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేరాడని పేర్కొన్నారు. ఆసుపత్రిలో ఆ యువకుడిని పరామర్శించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ మనుషుల మానప్రాణాలతో చెలగాటమాడుతున్న శ్రీరామ్ ఫైనాన్స్ సిబ్బందిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. మైలవరం గ్రామానికి చెందిన జెర్మియా అనే యువకుడు తను పనికి వెళ్లే అవసరాలరీత్యా జమ్మలమడుగు శ్రీరామ్ ఫైనాన్స్‌లో స్కూటీ నెల కంతుల వారీగా లోన్ తీసుకున్నాడు. కొన్ని నెలల వరకు టైం ప్రకారం కంతులు కట్టుకుంటూ వచ్చాడు. ఇటీవలి కాలంలో అధిక వర్షాల కారణంగా పనులు లేక ఆర్థికంగా ఇబ్బంది పడడంతో ఈనెల కంతు కట్టలేనని, రెండు నెలల కంతులు కలిపి వచ్చే నెలలో కడతానని చెప్పినా ఫైనాన్స్ వారు వినకుండా ఇష్టానుసారం ఆ యువకుడిని తిట్టి బెదిరించి అతని అనుమతి లేకుండా స్కూటీని బలవంతంగా లాక్కొని వెళ్లిపోయారన్నారు. ఇష్టానుసారం అతన్ని నలుగురిలో అవమానపరుస్తూ బెదిరించి స్కూటీని తీసుకు వెళ్లడంతో మనస్థాపానికి గురయ్యాడన్నారు. నియోజక వర్గంలో ఇటీవల కాలంలో అనేక రూపాల్లో ఇలాంటి సమస్యలు స్థానిక ప్రజ లకు ఎదురవుతున్నా పట్టించుకునే నాథుడేలేడన్నారు. పరా మర్శం చినవారిలో ఎస్‌ఎఫ్‌ఐ టౌన్ కమిటీ సభ్యుడు సాయికిరణ్, బాషా పాల్గొన్నారు.

చర్చలతో సమస్యను పరిష్కరించుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఖాదర్ హుస్సేన్ మసీదు కమిటీ సభ్యులు, అంజుమన్ కమిటీ సభ్యులు పరస్పర చర్చలతో సమస్యను పరిష్కరించుకోవాలని స్థానికులు సూచిస్తున్నారు. ఖాదర్ హుస్సేన్ మసీదు కమిటీ నిర్వహణ సరిగా లేదని, కమిటీని రద్దు చేయాలని కోరుతూ స్థానికులు అంజుమన్ కమిటీకి లేఖ రాశారు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ముందస్తు సమాచారంతో అంజిమన్ సభ్యులు బుధవారం మసీదు వద్దకు వెళ్లగా మసీదుకు తాళం వేసి కనిపించింది. చేసేదేమీ లేక అంజుమన్ సభ్యులు మసీదు వద్దనే కాసేపు బైఠాయించారు. వన్ టౌన్ పోలీసులు ఫోన్ చేసినా కమిటీ సభ్యులు స్పందించలేదు. అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ముక్తియార్ వన్ టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. కమిటీ సభ్యులు అంజుమన్ పెద్దలు పరస్పరం చర్చించుకుని సమస్యను పరిష్కరించుకోవాలని స్థానికులు కోరారు.

ఉల్లి రైతుల ఉసురు తగలకుండా చూసుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ఉల్లి రైతుల ఉసురు తగలకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు చూసుకోవాలని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉల్లి చేసే మేలు తల్లి కూడా చేయదని పెద్దలు అంటారని, ప్రస్తుతం ఉల్లి రైతుల పరిస్థితి కడు దయనీయంగా ఉందన్నారు. ఉల్లి సాగు కోసం ఎకరాకు రూ.లక్ష వరకు ఖర్చు పెట్టారని చెప్పారు. పంట చేతికి వచ్చింది కాని కొన్నిచోట్ల పంట పీకేశారని చెప్పారు. మరికొన్ని చోట్ల పంట పికేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కర్నూలు మార్కెట్లో అంతోఇంతో కొన్నారని తెలిపారు. కమలాపురం, మైదుకూరు మార్కెట్ యార్డుల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని చెప్పి, ఆ ఊసేలేదన్నారు. రెండున్నర ఎకరాకు రూ.50 వేలు నష్టపరిహారం చెల్లిస్తామని ముఖ్యమంత్రి, వ్యవసాయ మంత్రి చెప్పడమే తప్ప, జిఒ ఇవ్వలేదన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి

ప్రజాశక్తి - లింగాల

ఎన్నికల కమిషన్ సమర్థవంతంగా పనిచేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని రాష్ట్ర, దేశం బాగుండాలంటే ఓట్ల చోరీకి అడ్డుకట్ట వేయాలని కాంగ్రెస్ పార్టీ పులివెందుల నియోజకవర్గం ఇన్‌ఛార్జి ధ్రువకుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. చిన్నకుడాలలో బుధవారం ఆయన సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ లింగాల మండల అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, పులివెందుల పట్టణ అధ్యక్షుడు శివకల్యాణ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

జమ్మలమడుగు : ఓటర్ల జాబితా అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ దేశ వ్యాప్త ఉద్యమం చేస్తోందని, ఓటుదొంగ.. గద్దె దిగు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జమ్మలమడుగు నియోజవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి సింగం శివ మోహన్‌రెడ్డి కోరారు. బుధవారం జమ్మలమడుగులో ఆయన ఓటు దొంగ గద్దె దిగు కార్యక్రమంపై విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన సంతకాల సేకరణ ఉద్యమానికి ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలన్నారు. శుక్రవారం జమ్మలమడుగు పాత బస్టాండ్‌లో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపడుతున్నామని, ఇందులో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, శ్రీనాథ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

పార్టీ కోసం కష్టపడే వారికి సముచిత స్థానం

ప్రజాశక్తి - చాపాడు

పార్టీ కోసం కష్టపడి పని చేసే వారికి సముచిత స్థానం లభిస్తుందని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. ఎపి రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్‌గా ప్రముఖ న్యాయవాది దాసరి బాబు నియమితులయ్యారు. ఈ సందర్భంగా బుధవారం ఎమ్మెల్యేను ప్రొద్దుటూరు క్యాంప్ ఆఫీస్‌లో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దాసరి బాబు పదేళ్లుగా పార్టీ కోసం ఎంతగానో కష్టపడ్డారన్నారు. ఆయన సేవలను గుర్తించి రాష్ట్ర డైరెక్టర్‌గా నియమించాలని ప్రభుత్వ పెద్దలను కోరామన్నారు. మరో కొంతమంది రాష్ట్ర డైరెక్టర్లుగా పదవులు అలంకరించబోతున్నారని తెలిపారు. పార్టీ కోసం నిజాయితీగా పని చేస్తే పార్టీలో, తన మనసులో ఎప్పటికీ ఉన్నత స్థానం ఉంటుందన్నారు. దాసరి బాబు మాట్లాడుతూ పార్టీ కోసం నిజాయితీగా పనిచేసినందునే ఎమ్మెల్యే ఈ పదవిని ఇచ్చారన్నారు. తన పదవికి తప్పకుండా న్యాయం చేస్తానని, ఆయనకు ఎన్నడూ చెడ్డ పేరు తీసుకురానని బాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ధనపాల జగన్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసులు, పట్టణ ఉపాధ్యక్షుడు యాపరాల లక్ష్మీనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపీ రవీంద్ర, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి డైరెక్టర్ యాపరాల చిన్న, సిండికేట్ బ్యాంక్ చైర్మన్ పాశం మారుతి, సోమిశెట్టి గిరి, బండి అమర్నాథ్, తుపాకుల రమణ, దాసరి చినబాబు, మన్యం రమేష్, మాజీ సర్పంచ్ చీకిరి వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

హెచ్ఐవి గురించి చర్చిద్దాం.. నివారిద్దాం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

హెచ్ఐవి గురించి చర్చిద్దాం.. హెచ్ఐవి నివారిద్దామని స్నేహిత అమృత హస్త సేవాసమితి అధ్యక్షుడు రాజు పేర్కొన్నారు. పట్టణంలోని గాంధీ కూడలి, పూలంగళ్ల బస్టాండ్, బిఎస్ఎన్ఎల్, ఆర్‌టిసి, పాత బస్టాండ్, పుర వీధుల్లో ఎపి రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఐఈసి టెంట్ హౌస్‌ను ఏర్పాటు చేశారు. టెంట్‌హౌస్ ముఖ్య ఉద్దేశ్యం వివరిస్తూ హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాప్తి నివారణపైన ప్రజలను చైతన్య పరుస్తూ, హెచ్ఐవికి మందు లేదని, నివారణ ఒక్కటే మార్గమని వివరించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తూ వివరించారు. సీడీఎస్ మేనేజర్ వల్లి, నగీన్ బాషా, అనురాధ, పుష్పరాజ్ పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల చేస్తున్న సేవా సమితి సభ్యులు

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డి.గురివిరెడ్డి

మహిళల ఆరోగ్యం కోసం ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి - చాపాడు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థనారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం డాక్టర్ శివ ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ వైస్ చైర్మన్ గురివిరెడ్డి, సొసైటీ చైర్మన్ నరసింహారెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ మాతశిశు సంరక్షణ, కేన్సర్ స్క్రీనింగ్, పోషకాహార లోపం, కీటక జననీ వ్యాధి, టిబి, స్త్రీల వ్యాధులను గుర్తించడం కోసం ప్రభుత్వం ఆ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. 223 మంది మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు ఇలియానా, రాజేష్, శ్రీవాణి, కావ్య మాధురి, చంద్రమౌళి, సిబ్బంది రాఘవయ్య, సుకన్య, లక్ష్మీదేవి, బాబు రెడ్డి, ప్రసాద్, భాస్కర్, వైద్య సిబ్బంది, అంగన్వాడీ టీచర్స్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి

ఇటీవల కురుస్తున్న భారీ వర్షా లతో సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని అర్బన్ వైద్యాధికారి డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. స్థానిక ప్రభు త్వాసు పత్రిలో బుధవారం శ్రీనాథ్ రెడ్డి మాట్లా డుతూ ఇంటి పరిసరాలలో మురుగునీరు నిల్వ ఉండ కుండా చూసు కోవాలన్నారు. మురుగుతో దోమలు ప్రబలుతాయని తెలిపారు. దోమ కాటు ద్వారా స్థానికులు జ్వరాల బారిన పడుతున్నారని వివరించారు. దోమతెరలు తప్పక వాడాలన్నారు. వాతా వరణ ప్రభావంతో జలుబు, దగ్గుతో ఎక్కువ మంది బాధపడుతున్నారని తెలి పారు. పిల్లలకు షెడ్యూల్ ప్రకారం టీకాలు కచ్చితంగా వేయించాలని వివ రించారు. సిబ్బంది కొరత గురించి అడగగా ఒక అటెండర్ కొరత ఉందని, అలాగే స్థానికంగా వాచ్మెన్ అవసరమని ఉన్నతాధికారులకు ప్రతిపాదన పంపామని తెలిపారు. ఆర్ఎంపిలు ప్రథమ చికిత్సఆలయాలు అని బోర్డు పెట్టుకోవచ్చన్నార. పరిమితులకు మించి వైద్యం చేయరాదని, అవసరమైతే రోగులకు అర్హతగల వైద్యుల వద్దకు పంపించాలని సూచించారు. స్టెరాయిడ్స్ వాడరాదని తెలిపారు.

డేవిడ్‌రాజును సన్మానిస్తున్న ప్రభుత్వాసుపత్రి సిబ్బంది

రక్తదాన సేవలకు సన్మానం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా ప్రొద్దుటూరు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో భగత్‌సింగ్ బ్లడ్ డొనేట్ గ్రూప్ గుర్రం డేవిడ్ రాజ్‌ను కొత్తగా వచ్చిన మెడికల్ సూపరింటెండెంట్ సుజాత, బ్లడ్ బ్యాంక్ డాక్టర్స్ గోపాల్, రూపనాథ్ బుధవారం ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ అన్ని దానాల కన్నా రక్తదానం మిన్న అన్నారు. రక్తదానం చేయండి.. ప్రాణదాతలు కండి అని వారు పిలుపునిచ్చారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చున్నారు. రక్తం ఇవ్వడం వల్ల ఇతరుల ప్రాణాలను కాపాడిన వారు అవుతారన్నారు. 24/7 రక్తనిధి కేంద్రం ప్రొద్దుటూరులో అందుబాటులో ఉంటుందన్నారు. స్వచ్ఛందంగా ఎవరైనా ప్రొద్దుటూరు రక్తనిధి కేంద్రంలో రక్తం ఇవ్వవచ్చున్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్స్, రక్త నిధి సిబ్బంది, భగత్‌సింగ్ బ్లడ్ డొనేట్ గ్రూప్ ఆర్యన్, పుల్లయ్య, రామకృష్ణ, సూరజ్, మహేష్ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లి గ్రామపంచాయతీలో డ్రెయినేజీ, పారిశుధ్యంపై అధికారులు, సిబ్బంది ప్రత్యేకదృష్టి పెట్టాలని డిఎల్‌డిఓ విజయలక్ష్మి సూచించారు. బుధవారం సాయంత్రం ఆమె వేంపల్లి గ్రామ పంచాయతీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇంటి కుళాయి, వాణిజ్య సదుపాయాలు తదితర పన్నులను ఆన్‌లైన్‌లో చెల్లించాలని తెలిపారు. ఇప్పటివరకు ఎంతమంది ఆన్‌లైన్ పన్నులు చెల్లించారో వివరాలు తెలియజేయాలన్నారు. అధికారులు గ్రామ పంచాయతీలో ఉన్న ప్రజలకు పన్నులు ఆన్‌లైన్‌లోనే చెల్లించేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఇఒ నాగభూషణ్‌రెడ్డి, జమ్మలమడుగు డిఎల్‌డిఓ రామాంజనేయరెడ్డి, ఈఓపిఆర్డీ రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - లింగాల

మృతి చెందిన జయప్ప

ఇప్పట్ల గ్రామ సమీపంలో ద్విచక్రవాహనంలో వెళుతుండగా ఐచర్ వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. హెడ్ కానిస్టేబుల్ రాజు తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం జిల్లా యల్లనూరు మండలం సింగవరం గ్రామానికి చెందిన జయప్ప (58) ద్విచక్రవాహనంలో పులివెందుల నుంచి సొంత గ్రామానికి వెళుతుండగా మార్గమధ్యలో ఐచర్ వాహనం అదుపుతప్పి ఢీకొంది. జయప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ

ప్రజాశక్తి - ముద్దనూరు

కడప-తాడిపత్రి ప్రధాన రహదారి యామవరం గ్రామ సమీపంలో రోడ్డుపై ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీ కొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రగుంట్ల మండలం ఆర్‌టిపిపి నుంచి లారీ బూడిద లోడుతో తాడిపత్రి వైపు వెళుతూ.. యామవరం గ్రామ సమీపంలో రాగానే లారీ మరమ్మతులకు గురై ఆగిపోయింది. కృష్ణపట్నం పోర్టు నుంచి ఐరన్ లోడుతో తాడిపత్రి వైపు వెళుతున్న లారీ ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీ కొట్టింది. ప్రమాదంలో ఐరన్ లారీ డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కు పోయి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతన్ని బయటకు తీసి 108లో ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు.

IN THE COURT OF THE IInd ADDITIONAL DISTRICT JUDGE KADAPA AT PRODDATUR

E.P.No. 75/2024
O.S.No. 19/2014

Dr.Mugennagari Varalakshmi, W/o Dr.J.Krishna Reddy, aged 76 years, Hindu, Business, D.No. 5/1895, Geethashram Street, Proddatur Town, Kadapa (Dt). ...Petitioner/D.Hr.

Vs

Asam Venkata Rami Reddy, S/o Rama Krishna Reddy, aged 64 years, Hindu, Business, HIG65, AP Housing Board Colony, Proddatur Town, Kadapa (Dt). ...Respondent/J.Dr.

రెస్పాండెంట్/జె.డిఆర్‌కి U/o 21.R64 నోటీసు

ఈ నెంబరు E.Pలోని పిటిషనర్/డి.హెచ్ఆర్, రెస్పాండెంట్/జె.డిఆర్ అయిన నీకు పై డిక్రీ బాకీని అమలు పరుచుకొనుటకు గాను రెస్పాండెంట్/జె.డిఆర్ తాలూకు చెందిన ఆస్తిని వేలమునకు కోరి E.Pని దాఖలు చేసి ఉన్నారు. అట్టి E.Pలో రెస్పాండెంట్/జె.డిఆర్ అయిన U/o.21. R.64 నోటీసులకు గాను 14.10.2025 నాడు వాయిదా ఉంటూ వున్నది. అట్టి వాయిదా తేదీ నాడు ఉదయం గం॥ 10.30 ని॥లకు రాజశ్రీ పై కోర్టు వారి ఎదుట హాజరై ఏవైనా ఆక్షేపణలు ఉన్న ఎడల తెలుపు కోవలసినది. లేనంతట నీ పరోక్షమందు తీర్మానించమడును.

వాయిదా తేది: 14.10.2025.

//By Order of the Court//

సి.వి.సురేష్
అడ్వకేట్, ప్రొద్దుటూరు.

IN THE COURT OF THE HONOURABLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, PRODDATUR

O.S.No. 281/2020

Bukkapatnam Jayasankar, S/o Jayaram, aged about 51 years, Hindu, Ex-Serviceman, residing at D.No.A-401, Dhara Apartment, Mydukur Road, Proddatur Town and Mandal, Kadapa District, Andhra Pradesh. ...Plaintiff

Vs

Atmakur Shanmukham, S/o Kumara Swamy, aged 50 years, Hindu, Business, residing at D.No.W-13-546, 2nd Ward, Sastri Nagar, Akkayapalli, Kadapa City - 516 003. ...Defendant

SUMMON

The plaintiff filed the suit against the defendant for recovery of the suit amount of Rs.8,59,666-00 (rupees Eight Lakhs Fifty Nine Thousand Six hundred and Sixty Six rupees only) and stands for service of summons on 7-10-2025 at 10:30 A.M. The defendant is directed to appear before this Hon'ble Court on the said above date without fail, otherwise the matter will be decided against the defendant.

//By Order of Court//

P.RAMA GURAPPA
Advocate for the Plaintiff,
PRODDATUR

మహారాజశ్రీ 1వ అదనపు జిల్లా జడ్జి, కడప వారి కోర్టులో

E.P.No. 1/2024
A.R.B.No. 408/2019

మైనర్స్ శ్రీరామ్ ట్రాన్స్ పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్, బద్వేల్. ...D.Hr.

Vs

1. వరపల్లి ఉమా,
2. కె.సురేష్ కుమార్ ...J.Drs.

పై ఇ.పి.లో జె.డి.ఆర్. నం.2 కు పక్షముగా ముఖ్యముగా ఆర్డర్ 21 రూల్ 48 సిపిసి నోటీసు

J.Dr.No.2 కె.సురేష్ కుమార్, S/o కె.వెంకటసుబ్బయ్య, Resident of D.No.5/12 నర్శపురం గ్రామం, ఎ.కాశినాయన మండలం, వైఎస్ఆర్ కడప జిల్లా.

అను మీ మీద D.Hr. కంపేని తనకు డిక్రీ ద్వారా రావలసిన ఇ.పి. మొత్తమును రాబట్టుకొనుటకు గాను U/o 21R48 CPC క్రింద మీయొక్క జీతము జప్తు చేసి, తదుపరి కోర్టు కు తెప్పించుకొనుటకు గాను పై ఇ.పి. సలుపగా సద్గురు ఇ.పి.లో మీ యొక్క హాజరుకు గాను 07/10/2025 తేదీన వాయిదా వున్నది.. కావున సదురు 07/10/2025 వ తేదీ ఉదయం 10.30 గంటలకు మీరు నేరుగా గానీ, వకీలు ద్వారా గానీ, రాజశ్రీ పై కోర్టు నందు హాజరై మీకు ఏదైన ఆక్షేపణలు/అభ్యంతరాలు వున్నా యెడల కోర్టు వారికీ తెలుపుకోనంతట పై ఇ.పి.ని మీ పరోక్షముగా తీర్మానించెదరు. .

//రాజశ్రీ కోర్టు వారు ఉత్తర్వుల మేరకు//

డి. రామాంజనేయులు,
డి.హెచ్.ఆర్. వకీలు, కడప.